www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 7 జులై 2024

5

తూర్పుగోదావరి



## సీతానగరం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**ప్రజాశక్తి - సీతానగరం**

సీతానగరం పంచాయతి ఇన్‌ఛార్జి కార్యదర్శి సిహెచ్.నాగ సతీష్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి నందున సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో కలెక్టర్ పర్యటించారు. వీధుల్లో దుర్గంధం, డ్రైనేజీలు పూడికతీత తీయకపోవడంతో గ్రామంలో పారిశుధ్య లేమి వల్ల డయేరియా వ్యాధి బారిన పడి 11 మంది ఆసుపత్రి పాలయ్యారు. పరిస్థితిని గమనించిన కలెక్టర్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో గ్రామ పంచాయతీ అధికారి డి.రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సీతానగరం మండల ఇఒపిఆర్‌డి కెవివిఎస్ఎస్.మూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

# 'ద్వారంపూడి' చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్
- ఇప్పటికే వేల టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్
- మాజీ ఎంఎల్ఎ చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు

**ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి**

కాకినాడ సిటీ వైసిపి మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. అధికారంలోకొచ్చిన కొద్ది రోజుల్లోనే చంద్రశేఖర్‌రెడ్డి వ్యాపార, వ్యవహారాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అధికారంలో ఉన్నప్పుడు ద్వారంపూడి పలు సందర్భాల్లో పవన్‌కళ్యాణ్‌పై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేసేవారు. ఈ తరుణంలోనే కొత్త ప్రభుత్వం ద్వారంపూడిని టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. రెండు రోజుల జిల్లా పర్యటనలో రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బియ్యం అక్రమ రవాణాపైనే దృష్టి పెట్టారు. అధికారులతో సుదీర్ఘంగా సమీక్షలు జరిపారు. స్వయంగా తనిఖీల నిర్వహించిన ఆయన వివిధ గొడౌన్లలో అనధికారకంగా నిల్వ ఉంచిన 13 వేలకు మెట్రిక్ టన్నులకు పైగా పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేయించారు. కాకినాడ పోర్ట్ కేంద్రంగా సాగిన రీసైక్లింగ్ బియ్యం ఎగుమతులపై సిఐడితో విచారణ జరిపిస్తామని ప్రకటించారు.

ఈ నెల 2న కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని రాజ్యలక్ష్మీనగర్‌లో వైసిపి నేత బళ్ల సూరిబాబుకు చెందిన అక్రమ కట్టడాన్ని అధికారులు కూల్చివేశారు. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి తన అనుచరులతో వెళ్లి అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ద్వారంపూడిని పోలీసులు అడ్డుకున్నారు. అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారనే కారణంతో ద్వారంపూడి, మరో 24 మంది వైసిపి నేతలపై నగరపాలక సంస్థ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే రౌడీ ద్వారంపూడి అంటూ టిడిపి సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయ్యింది. కావాలనే ప్రభుత్వం తనపై కక్ష సాధింపులకు దిగుతుందని ద్వారంపూడి అంటున్నారు. ద్వారంపూడి సోదరుడు నిర్వహిస్తున్న వీరభద్ర ఎక్స్ పోర్ట్ రొయ్యల పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు రెండు రోజుల క్రితం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 2న కాకినాడ కలెక్టరేట్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ రూరల్ గురజనాపల్లి, ప్రత్తిపాడు మండలం లంపకలోవలో ఉన్న వీరభద్ర ఆక్వా పరిశ్రమల నుంచి కాలుష్యంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. 24 గంటల్లో తనిఖీలు చేపట్టి ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అధికారరులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఇలా ద్వారంపూడి, కుటుంబ సభ్యుల వ్యాపార కార్యకలాపాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండడంపై రాజకీయ వర్గాల్లో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



ఇటీవల కాకినాడలో కట్టడాల కూల్చివేత వద్ద ద్వారంపూడిని అడ్డుకుంటున్న పోలీసులు

## ఉచిత ఇసుకపై మార్గదర్శకాలు : కలెక్టర్

**ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో శనివారం పింఛన్లు, ఉచిత ఇసుక పాలసీపై విజయవాడ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక పాలసీ విధానంలో వినియోగదారుల నుంచి కేవలం ఇసుక తవ్వకం, రవాణా, పరిపాలన పరమైన ఖర్చులను మాత్రమే వసూలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి రుసుమూ వసూలు చేయదన్నారు. లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు సరసమైన ధరకు ఇసుక సరఫరా ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద డిప్యూటీ తహసీల్దార్, ఆపై స్థాయి అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. మూడు షిఫ్టలలో విధులు కేటాయించాలన్నారు. ఉచిత ఇసుక పంపిణీ విధానం సమర్థవంతంగా అమలు చేసేలా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రధాన పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. 20 టన్నుల వరకూ వ్యక్తిగతంగా ఆధారాలు, వివరాలు తీసుకుని ఇసుక సరఫరా చేయాలని, ఆపై డిఎల్ఎస్‌సి ద్వారా సమీక్ష నిర్వహించి అనుమతులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో అమ్మకాలు జరిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలని తెలిపారు జిల్లా, డివిజనల్ స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాల్సి ఉందన్నారు. ఆయా స్టాక్ పాయింట్స్, డిసిల్టేషన్ పాయింట్స్ వద్ద మండల రెవిన్యూ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ నిరంతర పర్యవేక్షణ చెయ్యాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రవాణా కోసం వినియోగించే వాహనాలు స్టాక్ తీసుకుని వెళ్లగలిగే స్థాయి వివరాలు, జిపిఎస్ ట్రాకింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక సక్రమంగా రవాణా అయ్యేలా, ధరల నియంత్రణ విషయంలో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఇసుక తవ్వకం, లోడింగ్ వంటి అన్ని కార్యకలాపాలు సజావుగా జరిగేలా స్టాక్ యార్డ్ ఇన్చార్జులు బాధ్యత వహించాన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్‌ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ఇన్‌ఛార్జ్ జడ్జ్, 1వ అదనపు జిల్లా జడ్జ్ ఆర్.శివకుమార్ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, నిబంధనలు ఉల్లంఘించి ఎవరు వాహనాలు నడపరాదని హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రెండు చక్రాల వాహనం నడిపే ప్రతీ ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ అని సూచించారు. ఈ సదస్సులో రాజమహేంద్రవరంకు చెందిన న్యాయమూర్తులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.రామ్‌నారాయణ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సబితా, రాజమహేంద్రవరంకి చెందిన కోర్టు సిబ్బంది, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్



## భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి-దేవరపల్లి**

బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని బాలోత్సవ కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. శనివారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సభ్యులు మాట్లాడారు. బాలల్లో రాజ్యాంగ విలువలు, లక్ష్యాల మీద అవగాహన కల్పించడం వల్ల వారిని అత్యుత్తమ పౌరులుగా భవిష్యత్తు తరానికి అందించాలనే సంకల్పంతో మండలంలో 22 పాఠశాలలో విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 11 రోజులపాటు అన్ని పాఠశాల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించి సుమారు 1500 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించినట్టు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. పోటీ పరీక్షల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉండవల్లి కృష్ణారావు, కేసిరాజు సీతారామయ్య, నారాయణ విశ్వేశ్వరావు, ఏలూరు ఎవిఆర్ విజ్ఞానం కేంద్రం కార్యదర్శి గూడపాటి నరసింహారావు, ఉస్సే శంకరుడు, నల్లమాటి రామారావు, కూచిపూడి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

### క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు

**ప్రజాశక్తి-ఉండ్రాజవరం**

విద్యుత్ వినియోగదారులు తమ నెలవారీ బిల్లులు ఇకపై బిల్లుపైన ఉన్న క్యూఆర్ కోడ్‌తో సులభంగా ఇంటి వద్దనే చెల్లించవచ్చని విద్యుత్ శాఖ ఎఇ నిడదవోలు దొరబాబు తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ఇలా పలు రకాల యాప్‌లతో ఇంతకాలం విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న వినియోగదారులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు తమ స్మార్ట్ ఫోన్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి, బిల్లులు చెల్లించవచ్చన్నారు.

### సంతలో సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాశక్తి-నిడదవోలు**

నిడదవోలు వారపు సంతలో సౌకర్యాలు కల్పించాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం వారపు సంత చిరు వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారపు సంతలకు ఎక్కువ సంఖ్యలో పేద ప్రజలు వస్తూ ఉంటారని, వ్యాపారులు వారు పన్నులు చెల్లిస్తారని, కానీ వారికి సౌకర్యాల కల్పనలో స్థానిక సంస్థలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని చెప్పారు. వారికి సౌకర్యాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం వర్తక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా జువ్వల రాంబాబు, అధ్యక్షునిగా పిట్టా రాజు, కార్యదర్శిగా యు.పుల్లారావు, కోశాధికారిగా సిహెచ్.సత్తిబాబు సభ్యులుగా ఎండి సత్తార్, ఎం.గురుమూర్తి, షేక్ హమీద్, ఎ.రామకృష్ణ, పి.నాగలక్ష్మి, టి.విజయ, జగతా శ్రీను ఎన్నికయ్యారు.

## జగ్జీవన్‌రామ్‌కు పలువురి ఘన నివాళి

**భారత తొలి ఉపప్రధాని జగ్జీవన్‌రామ్‌కు ఆయన 38వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నివాళులర్పించారు.**

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**నల్లజర్ల** దూబచర్ల గాంధీ కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్ తాడిగడప బాలయ్య పూల దండలు వేసి నివాళులర్పించారు.

**నిడదవోలు** మండలం సింగవరంలో చెట్టే రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు.కోడి సుజ్ఞాన్ కుమార్, చెట్టే సుబ్బారావు, రమేష్, తాడేపల్లి విశాల్, అజయ్, మోషే, బాలు పాల్గొన్నారు.

**తాళ్లపూడి** రాగోలపల్లి ఎంపిపి పాఠశాలలో హెచ్ఎం దున్నా దుర్గారావు ఘనంగా నివాళులర్పించారు. తాళ్లపూడిలో సచివాలయ కార్యదర్శి సిహెచ్.అలేఖ్య నివాళు లర్పించారు. ఉద్యోగులు శ్రీను, గణేష్, కొప్పాక కోట్నీస్, జి.జాన్, బి.కిషోర్ పాల్గొన్నారు.

**సీతానగరం** పురుషోత్తపట్నం జగ్జీవన్ రామ్ కాలనీలో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తనకాల నాగేశ్వరరావు, మండ రాంబాబు, చాకలి శశికళ, షేక్ మీరా షరీఫ్, రాజు, గంగరాజు, ఉందుర్తి ఇస్సాకు, పసలపూడి రత్నరాజు, ఖండెల్లి శేఖర్, మణికంఠ పాల్గొన్నారు.


**గోకవరంలో** జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ నివాళులర్పించారు. గవిని దుర్గాప్రసాద్, పదిలం మురళీకష్ణ, ప్రగడ ప్రభ, నేతల నరేంద్ర, గోకాడ ప్రసాద్, కాయల మణికంఠ, పాలెం బాబీ, రావూరి శ్రీనివాస్, బచ్చల రాజు, అబ్బిరెడ్డి మణికంఠ, పొన్నగంటి వీరబాబు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో..



సీతానగరంలో..



నిడదవోలులో..

### పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

**ప్రజాశక్తి-కడియం**

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పరిసరాల పరిశుభ్రతకు, అందరూ కలిసికట్టుగా పాటుపడుదామని మండలంలోని వేమగిరి తోటకు చెందిన టిడిపి నాయకులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపిటిసిలు వాసంశెట్టి నాగబాబు, అప్పారి అన్నవరం, యనమదల రాజు, జోగి చక్రవర్తి, వాసంశెట్టి బాలాజీ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతంలో పలు ప్రదేశాలను శుభ్రపరిచారు. రోడ్లు, డ్రైనేజీలలో చెత్త వేయరాదని, ఇంటి పరిసరాలను పరిశ్రమంగా ఉంచాలని సూచించారు. డయేరియా వంటి వ్యాధులు ప్రభావం ఏవిధంగా ఉంటుందనేదానిపై అవగాహన కల్పించారు. హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలి నిర్వహించారు.

### 'నన్నయ'లో అక్రమాలపై విచారణ చేయాలి

**ప్రజాశక్తి-రాజానగరం**

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అక్రమాలపై సిబిసిఐడి విచారణ చేయాలని రాజానగరం ఎంఎలఎ బత్తుల బలరామకృష్ణ డిమాండ్ చేశారు. దీనిపై యూనివర్సిటీ అకాడమీ డీన్ సురేష్ వర్మకు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 2019-2024లో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందన్నారు. యూనివర్సిటీలో అదనపు భవనాలు నిర్మాణాలలో అవినీతి జరిగిందన్నారు. మాజీ ఎంఎల్ఎ తమ బంధువులను విశ్వవిద్యాలయం కమిటీలో సభ్యులుగా ఉంచి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత 40 మందిని అర్హత లేకున్నా ఉద్యోగులుగా నియమించారని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి దర్యాప్తు చేయిస్తామన్నారు.

### సమస్యలపై 104 ఉద్యోగుల వినతి

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణకు శనివారం వినతిపత్రాలు అందించారు. రెండునెలల నుంచి వేతనాలు అందడం లేదని, ఉద్యోగుల పిఎఫ్ వాటాను యాజమాన్యం కట్టకుండారెండు వైపులా ఉద్యోగి వద్దనే వసూలు చేస్తున్నారని, పిహెచ్‌సిల ద్వారా వేతనాలు అందేలా చూడాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ సిస్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జిల్లా కమిటీ యూనియన్ అధ్యక్షుడు ఆలపాటి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి విజయ్, కోశాధికారి ఆజామ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్**

ప్రజా సమస్యల పరిష్కరించేందుకు అధికారులతో కలిసి పని చేస్తామని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక పేపరుమిల్లు సమీపంలోని వాంబే గృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా నగరపాలక సంస్థ అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నగరంలోని డ్రైన్స్, అంతర్గత రహదారులు, తాగునీటి సమస్యలు లేకుండా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇంటి కోసం పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చిన లబ్ధిదారులకు పట్టాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వాంబే కాలనీలో ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న బ్లాకులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ మీదుగా వెళ్లిన హైటెన్షన్ వైర్ తొలగించినందున ఆ బ్లాకు సిమెంట్ ప్లాస్టింగ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్, హౌసింగ్ అధికారులు, స్థానిక నాయకులు కొయ్యల రమణ తదితరులు పాల్గొన్నారు.



భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వాసు



సాగు నీరు విడుదల చేస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ

### తొర్రిగడ్డ నుంచి సాగునీరు విడుదల

**ప్రజాశక్తి - సీతానగరం**

పురుషోత్తపట్నంలో తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం నుంచి శనివారం రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి పంపులు ఆన్ చేసి సాగు నీరు విడుదల చేశారు. నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, నిర్వహణ, మరమ్మతులు, అవసరమైన నిధులు, పెండింగ్ బిల్లులపై సమగ్ర నివేదిక తయారు చేశామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయికట్టుకూ సాగునీటిని అందజేస్తామని చెప్పారు. ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారంపై న్యాయం చేయాలని కోరుతూ ఎంఎల్ఎ బలరామకృష్ణ, వెంకటరమణ చౌదరికి వినతిపత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండ రాంబాబు, చాకలి శశికళ, కలగర బాలకృష్ణ, చెరుకూరి ఉదయ భాస్కర రావు, మండ బుజ్జియ్య, చెరుకూరి వీర్రాజు, కారిచర్ల విజయ్ శంకర్, చెరుకూరి సురేష్ పాల్గొన్నారు.

### కార్టూన్ 'నిజం'




## నర్సరీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

**ప్రజాశక్తి-కడియం**

నర్సరీ రంగంలో దేశానికే తలమానికమైన కడియం నర్సరీల అభివృద్ధికి తగిన తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని ప్రముఖ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మార్గాని కడియం నర్సరీల ప్రగతిని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా దొరికే మొక్కలు ఒక్క కడియం నర్సరీ ప్రాంతం రైతులు మాత్రమే సేకరించి అభివృద్ధి చేస్తారని మార్గాని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నర్సరీలకు వచ్చే సబ్సిడీలు గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయాయని ఉద్యానవన శాఖను బలోపేతం చేసి నర్సరీలకు సబ్సిడీలు వచ్చే విధంగా తాడ్పాటు అందిచాలని మార్గాని కోరారు.



కలెక్టర్‌ను కలిసిన మార్గాని సత్యనారాయణ

### దగ్ధమైన సాయి స్వీట్ స్టాల్ పరిశీలన

**ప్రజాశక్తి-బిక్కవోలు**

కొమరిపాలెం మాజీ ఉప సర్పంచ్ టిడిపి నాయకుడు డివిఆర్‌ను తుది ముట్టించేందుకే సాయి స్వీట్ షాప్‌నకు అర్ధరాత్రి నిప్పు పెట్టారని అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కొమరిపాలెంలో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదానికి గురైన శ్రీసాయి స్వీట్ స్టాల్‌ను శుక్రవారం ఎంఎల్ఎ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిఆర్‌పై దాడి చేసి చంపేందుకు ఇటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు తెలియపరిచినా ఎటువంటి స్పందన లేదన్నారు.

### బాధిత కుటుంబానికి సామగ్రి అందజేత

**ప్రజాశక్తి-తాళ్లపూడి**

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పైడిమెట్ట గ్రామానికి చెందిన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ సేవా సంస్థ సుమారు రూ.32 వేల విలువైన మంచాలు, గ్యాస్ స్టవ్, స్టీలు సామాన్లు నిత్యావసర వస్తువులు అందజేసింది. పలువురు దాతల సహాయ సహకారాలతో వీటిని సమకూర్చినట్టు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు, తాళ్లపూడి ఎంఇఒ సిహెచ్.బాలామణి, నాయకులు యాళ్ల బాబూరావు, నందన ఫౌండేషన్ ప్రతినిధి రవి, సోషల్ సర్వీస్ సేవా సంస్థ ప్రతినిధులు ప్రత్తిపాటి అబెద్నగో, రాజు, సుధాకర్, భాను, పవన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీతానగరంలో విద్యార్థులకు కిట్ల పంపిణీ

**ప్రజాశక్తి - సీతానగరం**

సీతానగరం పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి శనివారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో బ్యాగ్, బూట్లు, బెల్ట్, దుస్తులు ఉన్నాయి. ఎంఇఒ స్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# నేరాలు ఘోరాలు

## సారా బట్టీపై దాడి ముగ్గురు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని రాంపాలెం గ్రామ శివారులో సారా బట్టీలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కే.సతీష్ కుమార్ తెలిపారు. శనివారం ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు గోపాలపురం పోలీస్ స్టేషన్కు రాబడిన సమాచారం ప్రకారం గోపాలపురం మండలం, రాంపాలెం గ్రామ శివారు ఫారెస్ట్ ఏరియా కొండ మీద సారా బట్టి దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ దాడులలో ఏ1 గా బొమ్మిన అయ్యప్ప బుచ్చియ్యపాలెం గ్రామం, ఏ2 గా పులిబోయిన శ్రీను బాబు, బుచ్చియ్యపాలెం గ్రామం,ఏ3 గా పంది గంగారావు రాంపాలెం గ్రామం అను వ్యక్తులు నాటు సారాను తయారు చేస్తుండగా పట్టుకొని వారి వద్ద నుండి 15 వేల రూపాయలు విలువ గల 50 లీటర్ల నాటు సారా వాటి విలువ స్వాదిన పర్చుకోని.3 వేలు లీటర్ల బెల్లపు ఊట 15 ప్లాస్టిక్ డ్రమ్స్, కట్టెల పొయ్యిలు -2, మట్టి కుండలు -10 లను ధ్వంసం చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారిని రిమాండ్ కొరకు కొవ్వూరు కోర్టునకు తరలించినట్లు తెలిపారు.

## దొంగను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అర్ధరాత్రి మోటర్ సైకిల్ను అపహరిస్తున్న దొంగను పట్టుకుని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాలు ప్రకారం.. మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన ఉండమడతల సూర్యనారాయణ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి ఒక గుర్తు తెలియని వ్యక్తి బీరువాలో ఉన్న బంగారం, వెండిని దొంగిలించి బయట ఉన్న మోటార్ సైకిల్ పట్టుకెళ్తుండగా అలికిడి అయ్యింది. దీంతో చుట్టుపక్క వాళ్లు దొంగను పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. శనివారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు కాలినడకన వచ్చే యాత్రికులు వలే దొంగలు శుక్రవారం రాత్రి రెక్కి నిర్వహించి ఇళ్లల్లో చొర బడి బంగారం డబ్బులు ఎత్తుకుపోతున్నారు. దీంతో రాత్రులు గ్రామస్తుల కాపలా కాయడంతో దొంగ చిక్కాడు.

## బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - రాజోలు

పొన్నమండ గ్రామంలో బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాజోలు ఎస్ఐ జి.పృథ్వీ శనివారం తెలిపారు. పొన్నమండకు చెందిన మందపాటి అయ్యప్ప స్వామి అనే ఆటో డ్రైవర్ అదే గ్రామానికి చెందిన బాలికను రెండేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. మలికిపురంలో ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఆ బాలికను భయపెట్టి ఏడాది క్రితం ఎవరికి తెలియకుండా వివాహం చేసుకున్నాడు. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాడు. అయితే రెండు నెలల క్రితం బాలికకు తెలియకుండా పెద్దల సంక్షేమంలో మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో బాలిక ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో ఆమెను బెదిరించి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆమె కుటుంబ సభ్యులు రావడంతో సెల్ ఫోన్ వదిలి ఇంటిపై నుంచి దూకి పారిపోయాడు. అతని సెల్ఫోన్లో ఉన్న పెళ్లి ఫోటోలు చూసి మోసపోయానని భావించిన బాలిక ఆటో డ్రైవర్ అయ్యప్ప స్వామిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం రైస్ మిల్లులో సుమారు 8 టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్ చేసినట్టు పెరవలి, ఉండ్రాజవరం సివిఎస్డిటి ఎస్ఎస్.సుధీర్ రెడ్డి తెలిపారు. అబ్దుల్ గఫార్ నడుపుతున్న శ్రీసబిహా ట్రేడర్స్ రైస్ మిల్లులో సుమారు రూ.3.7 లక్షల విలువ చేసే బియ్యం లభించినట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని భద్రత నిమిత్తం పెరవలి దేవి సత్య రైస్ మిల్లులో భద్రపరుస్తున్నట్టు తెలిపారు.

## ఇసుక లారీల పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం ఇసుక ర్యాంపు నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను, ఒక జెసిబిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు లారీలను సీతానగరం పోలీస్ స్టేషన్కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లైంగిక వేధింపులను నిరోధించే దిశగా చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

లైంగిక వేధింపులను నిరోధించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం కలెక్టరేట్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, స్థానిక ఫిర్యాదుల కమిటీ నోడల్ అధికారులతో శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవాంఛనీయ చర్యలు లేదా లైంగిక లతో కూడిన ప్రవర్తన, ప్రతికూలమైన లేదా భయపెట్టే పని వాతావరణాన్ని సృష్టించడాన్ని మహిళలపై లైంగిక వేదింపుల చట్టం - 2013 స్పష్టమైన నిర్వచనాన్ని అందిస్తుందన్నారు. పది మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని చట్టం ఆదేశించిందన్నారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు, సురక్షితమైన పని వాతావరణాన్ని నిర్ధారించడానికి ఈ కమిటీ బాధ్యత వహిస్తుందన్నారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్ చైర్ పర్సన్ గా సివిల్ సప్లయి డిఎం టి.రాధిక, ఎక్స్ ఆఫీషియో మెంబర్గా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కె. విజయకుమారి, సభ్యులుగా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్. జ్యోతి, డిఎల్డిఒ పి.వీణాదేవి, ఏకలవ్య చిల్డ్రన్ హోమ్ ప్రతినిధి పి.శేషారత్నంను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 78 మహిళలపై లైంగిక వేధింపుల నిరోధించే కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2013 మహిళా హక్కుల పరిరక్షణలో భాగంగా పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు నిర్వహించడానికి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోంలు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, హాస్పిటల్స్, సహకార సంస్థలు, విద్యాసంస్థలు, కార్పొరేషన్లు, స్వయం ఉపాధిలు, బ్యాంకులు, మరే ఇతర పనిచేసే చోటనైనా పదిమంది కన్నా తక్కువగా ఉన్నాసరే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారందరి పట్ల ఈ చట్టం వర్తిస్తుందన్నారు.

# జోరుగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నదికి వరద నీరు చేరడంతో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతానికి నీరందించేందుకు అధికార యంత్రాంగం అడుగులు వేయటంతో మెట్ట ప్రాంతంలోనూ ఆశాజనకమైన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రైతులు పెట్టుబడి సాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యం బకాయిలు పెండింగ్ ఉన్నాయి. ఆ నిధుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా సాగు ప్రారంభం నాటికి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయటంతో రైతులకు కొంత ఊరట లభించేంది. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా రూ.20,000 నగదు సాయం అందజేస్తామన్న విషయం విధితమే. అయితే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఈ పథకంపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. మరో వైపు ఈ క్రాప్పైనా ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలో ప్రతి ఏటా గోదావరి వరదల కారణంగా పంట నష్టం జరుగుతున్న విషయం విధితమే. ఈ పరిస్థితులలో ఈ క్రాప్, పంటనష్ట పరిహారంపైనా ప్రభుత్వం మీన మీషాలు లెక్కించడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవటంతోపాటు రైతులకు అండగా నిలిచేందుకు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంది.

**డేంజర్ బెల్స్**

డయేరియా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. గత నెలలో తునిలో డయేరియా కేసులు వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. తాజాగా గోపాలపురం, సీతానగరంలలోనూ డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్టాప్ డయేరియా కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ఇటువంటి పరిస్థితులను అధిగమించేందుకు వైద్య ఆరోగ్య శాఖతోపాటు నగరపాలికలు, పంచాయతీలు కలిసి రావాల్సి ఉంది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవటంతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది.

**ఆనందమని'పింఛెన్'**

పింఛన్ల పంపిణీలో అధికార యంత్రంగం చూపించిన చొరవ లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమైంది. ఎన్నికల హామీలలో భాగంగా పింఛన్ల పెంపును టిడిపి అధినేత ప్రకటించిన విషయం విధితమే. ఈ హామీలో భాగంగా ఈ నెల రూ.4,000 పింఛన్తోపాటు ఏప్రిల్ నుంచి రూ.1000 చొప్పున రూ.3000 కలిపి మొత్తం రూ.7,000 చొప్పున ప్రభుత్వం పింఛన్లను అందజేసింది. గత ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లు అందజేసింది. అయితే ఈ సారి




వాలంటీర్ల సహకారం లేకుండా ఉద్యోగులు, ఉన్నతాధికారులు సైతం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసి నిర్ధేశిత కాలంలోనే పంపిణీ లక్ష్యాన్ని చేరుకున్నారు. రానున్న రోజులలో ఇదే విధానం కొనసాగిస్తారా..? లేక వలంటీర్ల సహకారం తీసుకుంటారా..? తెలియాల్సి ఉంది. ఎన్నికల ముందు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఇచ్చిన హామీ ఏ మేరకు అమలు చేస్తారో వేచి చూడాల్సి ఉంది. ఏదేమైనా పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం**

విద్యార్థి సంఘాల పిలుపుతో స్కూళ్లు, కాలేజీలు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్షా పత్రాలు లీకేజీపై కేంద్ర ప్రభుత్వ తీరుపై దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు భగ్గుమన్న విషయం విధితమే. విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా జిల్లాలోని సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించే కీలకమైన పరీక్షల నిర్వహణలోనూ కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న తీరుపై పలు విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా బాధ్యతా యుతంగా వ్యవహరించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

## 'కిమ్స్'లో 'రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

కిమ్స్ వైద్య కళాశాలలో శనివారం 'రోడ్ సేఫ్టీ'పై అవగాహనా సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గౌరి శంకరరావు, అడిషనల్ ఎస్పి.ఖాదర్ బాషా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి జాగ్రత్తల అవసరాన్ని వివరించారు. రోడ్డుపై వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను, నియమాలను తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్, అడ్వకేట్ మూర్తి మాట్లాడారు. ఈ అవగాహన కార్యక్రమ నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కెవివి.సత్యనారాయణ రాజు, ఎండి రవికిరణ్వర్మ అభినందించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాజు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మందనక్క తనుకు రాజు(60) శనివారం కాకినాడ జిజిహెచ్లో ఆకస్మికంగా మరణించారు. ఉపాధి కూలీగా పనిచేసే తనుకు రాజు సుమారు నెల రోజుల క్రితం ఉపాధి పనికి వెళ్లి పని ప్రారంభానికి ముందు వేచి ఉన్న సమయంలో కుక్క కరిచింది. దీంతో స్థానిక సిహెచ్సిలో కుక్క కాటుకు చికిత్స తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఇటీవల మళ్ళీ అనారోగ్యానికి గురికావడంతో స్థానిక సిహెచ్సిలో పరీక్షించగా వైద్యులు రాబిస్ వ్యాధి సోకినట్లు భావించి శుక్రవారం కాకినాడ జిజిహెచ్కు తరలించారు. చికిత్స అందించే క్రమంలో పరిస్థితి విషమించి శనివారం తనుకు రాజు మృతి చెందాడు. స్థానిక సిహెచ్సిలో కుక్క కాటుకు సంబంధించి పూర్తి కోర్సు వాడినప్పటికీ రాబీస్ వ్యాధి ఏవిధంగా సోకిందని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తు న్నారు. అందరికీ సహాయకారిగా ఉండే తణుకు రాజు ఆకస్మిక మృతి పట్ల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.



రాజు(ఫైల్)

## బిఎస్పి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - అమలాపురం

బిఎస్పి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్మ్ స్ట్రాంగ్ జరిగిన హత్యాకాండను నిరసిస్తూ నిరసన ప్రదర్శన జరిగింది. శనివారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి సీనియర్ నాయకులు బత్తుల లక్ష్మణరావు, జిల్లా ఇన్ఛార్జ కాశి భవాని, జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి జాన్ మోసే, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోజూ 10 నీటి నమూనాల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ



వార్డు పర్యటనలో నీటిని పరీక్షిస్తున్న కమిషనర్

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న నీటి నుంచి ప్రతీ రోజు 10 నమూనాలను పరిశీలించాలని అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించార. శనివారం ఆయన ఆనంద్ థియేటర్ సమీపంలోని ఫ్లై ఓవర్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి ఆక్రమ ణలను తొలగించేం దుకు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో మంచినీటి సరఫరా లోపాలపై ప్రజ లను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలలో ఏమైనా లోపాలు ఉన్నాయా ? అని ఆరా తీశారు. ప్రతిరోజు రెండు పూటలా నీరు సక్రమంగానే వస్తోందని, అయితే కొన్ని సార్లు నీరు రంగు మారడం సహా కొన్ని సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసు కొచ్చారు. దీంతో ఆయన విక్టోరియా వాటర్ వర్క్సును సందర్శించి పరిస్థితిని సమీక్షిం చారు. ఈ పర్య టనలో ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, డిఇ బిహెచ్. సుబ్బారావు, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, ఆయా సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



## అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలీ గ్రామంలో జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామివార్ల ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు గుంటూరు జిల్లా మంగళగిరి చెందిన జగన్నాధం, మాధవ కిరణ్ లు రూ.12,500 ఆలయ ఈవో కష్ణ చైతన్యకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం చేయించి స్వామి వారి ఫొటో, చరిత్ర పుస్తకం, అందజేశారు.

## మెరిట్ స్కాలర్షిప్లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్షల్లో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31 లోగా వెబ్ సైట్ నందు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని డిఇఒ ఎం.కమల కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 2023లో జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షల్లో స్కాలర్షిప్కు ఎంపికైన విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. అలాగే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, హెచ్ఎంలు ఈ నెల 15వ తేదీ లోపుగా ఆన్లైన్ విధానంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల మంజూరు

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

మండలంలోని కోరుమిల్లి గ్రామానికి ఆర్డిఎస్ఎస్ స్కీం ద్వారా 6 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు మంజూరయ్యాయి.కొద్ది కాలంగా గ్రామంలో లో వోల్టేజ్, ఓవర్ లోడ్ సమస్యలు ఉండడంతో ఆర్డి ఎస్ఎస్ స్కీమ్ ద్వారా గ్రామానికి నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు మంజూరయ్యాయని, వీటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు రామచంద్రపురం డిఇ వై.విజయ్ నంద్ తెలిపారు.

## బెల్లంపూడిలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామంలో శనివారం శివాలయం కాలనీ, ఎస్సి కాలనీలో వర్షం నీరు, మురుగు నీరు నిలవ ఉండకుండా సర్పంచ్ బండి మహాలక్ష్మి చర్యలు తీసుకున్నారు. డ్రయిన్లలోనూ, కచ్చా డ్రయిన్లలోనూ పూడిక తీత పనులను ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులతో ముమ్మరంగా నాలుగు రోజులు పాటు చేపట్టి, పూడికలు తీయించి, సిల్ట్ను ఎత్తించి, శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. శివాలయం కాలనీ లో కచ్చా డ్రయిన్ ఏర్పాటు చేయడానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగించమని ఎంపిడిఒ త్రిశూల పాణి, ఇఒపిఆర్డి డి.ఉమామహేశ్వరరావుకి సర్పంచ్ మహాలక్ష్మి విన్నవించడంతో పోలీస్ శాఖతో దగ్గర ఉండి అధికారులు ఆక్రమణలు తొలగించి డ్రయిన్ను తవ్వించారు. స్థానిక నాయకులు, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.





## లెక్చరర్ పోస్టులకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మార్కుల ఆధారంగా యానాం నుంచి ముగ్గురు లెక్చరర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒబిసి కేటగిరి నుంచి ఫిజిక్స్ పోస్టుకు మట్టా లలిత, జనరల్ కేటగిరి నుంచి హిందీ సబ్జెక్టుకు హాజరాబాను మహ్మద్, ఒబిసి కేటగిరి నుంచి హిస్టరీ పోస్టుకు రాయుడు ప్రసన్నకుమారి ఎంపికయ్యారని తెలిపారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని ఆదేశాలు జారీ చేశారన్నారు.

## ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీలో 5 రోజులు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్-అకాడెమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ డాక్టర్. డోలా సంజయ్, ఎఐఎంఎల్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఎం.వెంకటేష్, పాల్గొన్నారు.